AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
29-11-2025 (Saturday)
MAIN EDITION

## నా ఆశయం మాత్రం అదే..: ఉమ్రాన్ మాలిక్



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఉమ్రాన్ మాలిక్ అనగానే 150 కి.మీ. వేగంతో దూసుకొచ్చే బంతులు గుర్తుకువస్తాయి. బౌలింగ్‌లో మంచి పేస్ ఉన్న అతడు భారత జట్టులో మాత్రం ప్లేస్ కోల్పోయాడు. ఉమ్రాన్ మాలిక్ టీమ్‌ఇండియాకు ఆడి చాలా రోజులవుతోంది. ప్రస్తుతం అతడు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జమ్మూకశ్మీర్ తరఫున ఆడుతున్నాడు. ఈ సందర్భంగా అతడు తన ఆశయాన్ని వెల్లడించాడు. కచ్చితంగా తిరిగి భారత జట్టులోకి వస్తానని ఆశాభావం వ్యక్తం చేశాడు.

## మళ్లీ పెరిగిన బంగారం ధర..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. దేశీయంగా వీటి ధరలు భారీగా పెరిగాయి. పసిడి రూ.1.30 లక్షలకుపైనే పలుకుతుండగా.. వెండి కిలో రూ.1.80 లక్షలకు చేరువైంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శనివారం మధ్యాహ్నానికి 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,32,900గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,19,000 ఉందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. కిలో వెండి ధర ఏకంగా రూ.1,79,100కు చేరువైంది.

## సీఎం చంద్రబాబుపై షర్మిల ఫైర్



**అక్షరటుడే, ఏపీ:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబుపై కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ఎక్స్' వేదికగా ట్వీట్ పెట్టారు. "మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె కావాలా? అనేలా ఏపీ సీఎం చంద్రబాబు తీరు ఉంది. వరల్డ్ క్లాస్ అమరావతి ఎక్క డ? ఐకానిక్ సముదాయాల నిర్మాణాలేవి? అంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

## పబ్లిక్ ఇష్యూల సందడి..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** డిసెంబర్ తొలివారంలో పెద్ద సంఖ్యలో ఐపీవోలు సందడి చేయనున్నాయి. మీషో, ఏక్వస్, విద్యా వైర్స్ ఐపీవోలు సహా.. మొత్తం 11 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. వీటిలో మీషో అత్యధికంగా రూ.5421 కోట్లు సమీకరించనుంది. ఇవి కాకుండా ఎస్ఎంఈ కేటగిరీలో 6 సంస్థలు లిస్టింగ్‌కు రానున్నాయి.

## ఫేక్ కాల్ సెంటర్ ముఠా అరెస్టు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర రాజధానిలో కాల్‌సెంటర్ ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇంటర్నేషనల్ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో నకిలీ కాల్ సెంటర్ ముఠాను గుర్తించామని.. తాజాగా ఈ ముఠాను అరెస్టు చేసినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు వెల్లడించారు.

## వివాదాలు మా స్వభావంలో భాగం కాదు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వివాదాలు మా స్వభావంలో భాగం కాదు. అందరితో కలిసి ముందుకు సాగడం మా స్వభావం, సంస్కృతి అని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వేదికగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు ఎవరితోనూ వివాదాలు లేవని, వివాదాలకు దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సంస్కృతి అనేక విదేశాల మాదిరిగా లేదని అభిప్రాయపడ్డారు. భారతీయ 'రాష్ట్ర' భావన ఇతర దేశాల 'నేషనల్' భావన కంటే చాలా భిన్నమైనదని ఉద్ఘాటించారు.. భారత దేశంలో జాతీయవాదం ఒక సమస్యే కాదని మోహన్ భగవత్ అన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ బైక్ ఎత్తుకెళ్లిన దొంగ

**అక్షరటుడే, ఏపీ :** ఓ దొంగ ఏకంగా హెడ్ కానిస్టేబుల్ బైక్‌ను ఎత్తుకెళ్లాడు. అది కూడా పోలీస్ స్టేషన్ నుంచి చోరీ చేయడం గమనార్హం. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకుంది. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోరీ జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఓ నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం ఠాణాకు తీసుకు వచ్చారు. ఆ సమయంలో అదును చూసిన సదరు వ్యక్తి హెడ్ కానిస్టేబుల్ బైక్‌పై పరారయ్యాడు. దీంతో పోలీసులు షాక్ అయ్యారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

**కేసీఆర్.. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన నేత.. స్వరాష్ట్రం కోసం ఆయన చేసిన దీక్షతో పాటు మూడు కోట్ల మంది పోరాటంతో తెలంగాణ సిద్ధించింది. స్వరాష్ట్రంలో పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారు. అప్పటి నుంచి ఒకరి రెండు సార్లు మినహా బయటకు రావడం లేదు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలోనూ ఆయన ప్రచారం నిర్వహించలేదు. బీఆర్ఎస్‌ను అన్నీ తానై నడిపించే నేత బయటకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇచ్చింది. కానీ తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. అదే కేసీఆర్ రంగంలోకి దిగి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదనే చర్చ జరిగింది. తాజాగా పంచాయతీ ఎన్నికలు నేపథ్యంలో ఆయన తెరపైకి రావడం లేదు. కనీసం నేడు దీక్షా దివస్ సందర్భంగా కూడా కనిపించ లేదు. దీంతో పార్టీ శ్రేణులు నైరాశ్యంలో ఉన్నాయి.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# ఫామ్‌హౌస్‌లోనే గులాబీ బాస్

- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బయటకు రాని కేసీఆర్
- బీఆర్ఎస్ శ్రేణుల్లో నైరాశ్యం
- పంచాయతీ ఎన్నికల జోష్ కరువు

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. సభ నిబంధనల మేరకు రెండు మూడు సార్లు మాత్రమే హాజరయ్యారు. మరోవైపు ప్రజల్లోకి రావడం లేదు. అన్ని పనులు ఫామ్‌హౌజ్ నుంచే చక్కబెడుతున్నారు. ఇటీవల కీలకమైన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో కేసీఆర్ ప్రచారానికి వస్తారని అంతా భావించారు. అయినా కూడా ఆయన హాజరు కాలేదు. బీఆర్ఎస్ నాయకులతో పలుమార్లు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు నేతలు ప్రచారం చేశారు.

### పంచాయతీ ఎన్నికలు

రాష్ట్రంలో ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. రేపటి నుంచి రెండో దశ నామినేషన్లు ప్రారంభం కానున్నాయి. కేసీఆర్ నిరాహార దీక్ష చేపట్టిన నవంబర్ 29న దీక్షా దివస్ పేరిట బీఆర్ఎస్ పలు కార్యక్రమాలు నిర్వహించింది. అన్ని జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని భావిస్తోంది. అయితే ఈ రోజు కూడా కేసీఆర్ బయటకు రాలేదు. ఆయన చివరగా.. పార్టీ రజరోత్సవ సభలో మాట్లాడారు. అనంతరం వ్యవసాయ క్షేత్రానికే పరిమితం అయ్యారు. దీంతో గులాబీ శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంది. ఆయన ఒకసారి బయటకు వచ్చి సభ పెడితే పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

### సీఎం జిల్లాల పర్యటన

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపుతో ఊపు మీదున్న కాంగ్రెస్ పార్టీ.. పంచాయతీ ఎన్నికల్లో సైతం మెజారిటీ సీట్లు గెలవాలని యోచిస్తోంది. ఈ మేరకు ప్రజాపాలన వారోత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఓ వైపు సీఎం రేవంత్ రెడ్డి నిత్యం పర్యటనలు, సభల్లో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో జోష్ నింపుతుండగా.. బీఆర్ఎస్ అధినేత మాత్రం ఫామ్‌హౌజ్‌కు పరిమితం అవడం గమనార్హం.

## విద్యుత్‌తోనే అన్ని రంగాల అభివృద్ధి: డిప్యూటీ సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర విభజన తర్వాత విద్యుత్ డిమాండ్ పెరిగిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ రంగంపై శనివారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. తెలంగాణను 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒకేసారి 10 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగిందని తెలిపారు. 2047 వరకు లక్ష మెగావాట్లకు పైగా విద్యుత్ అవసరం అవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం మన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 27,769 మెగావాట్లుగా ఉందన్నారు. హైదరాబాద్ భవిష్యత్తులో గ్లోబల్ హబ్‌గా మారబోతున్న దృష్ట్యా విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించామన్నారు.

## మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేం



**అక్షరటుడే, వరంగల్:** మేడారం జాతరను జాతీయ పండుగగా ప్రకటించాలని ఏళ్లుగా డిమాండ్ ఉంది. దీనిపై తాజాగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వడం కుదరని తెలిపారు. శనివారం ఆయన వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఏ ఉత్సవాలకు జాతీయ హోదా లేదని తెలిపారు. మేడారానికి కూడా ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. భద్రాచలం ఆలయానికి రూ.50 కోట్లు, రామప్పకు రూ.150 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మేడారం జాతర విసయాన్ని కేంద్ర ట్రైబల్, టూరిజం మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

## చరిత్రలో నిలిచిపోయే రోజు దీక్షా దివస్: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్:** మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ సాధన కోసం నిరాహార దీక్ష చేపట్టిన రోజును బీఆర్ఎస్ నాయకులు దీక్షా దివస్‌గా జరుపుకుంటున్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించిన విషయం తెలిసిందే. కేసీఆర్ దీక్షపై 'ఎక్స్' వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. 16 ఏళ్ల క్రితం తెలంగాణ విధిని మార్చి రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన రోజు ఇది అని ఆయన అభివర్ణించారు. నవంబర్ 29, 2009 చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందిస్తూ.. ఒక యోధుని దీక్ష.. అమరుల త్యాగం యావత్ తెలంగాణ జాతికి మేలుకొలుపు అయ్యిందన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని విజయపథం వైపు నడిపిందన్నారు. భౌగోళిక తెలంగాణ సాధించాం. సామాజిక తెలంగాణ సాధిస్తామని పేర్కొన్నారు.

## దీక్షా దివస్ పేరుతో డ్రామాలు : సీతక్క



**అక్షరటుడే, హైదరాబాద్:** దీక్షా దివస్ పేరుతో బీఆర్ఎస్ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజు మాత్రమే దీక్షా దివస్ చేసేవారని గుర్తు చేశారు. ఇప్పుడు 10 రోజులపాటు దీక్షా దివస్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏంటో దీక్షా దివస్‌లో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లే అయినా.. ప్రజలకోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. అలాగే పలు ప్రాజెక్టులు, పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు.


## అఖండ2లో హర్షా లీ మల్హోత్రా..



అఖండ2 తాండవం కోసం బాలయ్య అభిమానులు, సినీ ప్రియులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. శుక్రవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగ్గా.. నటీనటులు సందడి చేశారు. అఖండ2లో బాలయ్య సరసన సంయుక్త మీనన్ నటించినట్లు ట్రైలర్‌లో చూపించారు. అలాగే అఖండలో బాలయ్యకు కూతురు ఉండగా.. ఆమె పెద్దయ్యాక ఎలా ఉంటుందనేది కూడా ట్రైలర్లో చూపించారు. అయితే ఆ ముఖాన్ని ఇంతవరకూ తెలుగు ప్రేక్షకులు ఎక్కడా చూసింది లేదు. అఖండ2 తాండవంలో బాలయ్య కూతురిగా నటించింది హర్షాలీ మల్హోత్రా. ఈమె బాలీవుడ్ నటి. భజరంగి భాయ్ జాన్ సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించింది. ప్రీ రిలీజ్ ఈవెంట్లో హర్షాలీ తన అందంతో, అమాయకమైన చూపులతో అందరినీ మైమరపించింది.

—అక్షరటుడే, సినిమా డెస్క్

## దిత్వా తుపాన్ ఎఫెక్ట్.. పలు జిల్లాలకు అలెర్ట్



**అక్షరటుడే, ఆంధ్రప్రదేశ్:** బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాన్ దూసుకు వస్తోంది. దీని ప్రభావంతో తమిళనాడులోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏపీలోని పలు ప్రాంతాలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దిత్వా తుపాన్ శ్రీలంకలో భారీ విధ్వంసం సృష్టించింది. వరదలు ముంచెత్తి ఆ దేశంలో చాలా మంది మరణించారు. ఈ తుపాన్ ప్రస్తుతం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాలవైపు దూసుకు వస్తోంది. పుదుచ్చేరికి 300 కి.మీ., చెన్నైకి దక్షిణాన 400 కి.మీ. దూరంలో ఉన్న దిత్వా సైక్లోన్ గంటకు 8 కి.మీ. వేగంతో కదులుతోంది. ఆదివారం ఉదయం తమిళనాడు తీర ప్రాంతాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తుపాన్ ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో సైతం మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.

## కర్ణాటక వివాదం ముగిసినట్టేనా..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** కర్ణాటక కాంగ్రెస్‌లో నెలకొన్న వివాదం ఎట్టకేలకు ముగిసినట్లు కనిపిస్తోంది. కర్ణాటకలో సీఎం మార్పుపై కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ భేటీతో సమస్య పరిష్కారం అయినట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం ఉదయం సీఎం, డిప్యూటీ సీఎం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. సమావేశం అనంతరం ఇద్దరు నేతలు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. డీకే శివకుమార్‌తో బ్రేక్‌ఫాస్ట్ చేయాలని కేసీ వేణుగోపాల్ చెప్పారని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. గందరగోళానికి పుల్‌స్టాప్ పెట్టాలనే బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేసుకున్నట్లు వెల్లడించారు. 2028 ఎన్నికల స్ట్రాటజీపై చర్చించామన్నారు. ఇద్దరి మధ్య చర్చలు ఫలవంతం అయ్యాయని డీకే శివకుమార్ వెల్లడించారు. కర్నాటక ప్రాధాన్యాలపై చర్చించామన్నారు.